క్లుప్తంగా

షేక్ ఆయిషాకు సన్మానం

మదనపల్లె సిటీ: గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన షేక్ ఆయిషాను స్థానిక ఉర్దూ అకాడమీలో ఘనంగా సన్మానించారు. ఆయిషా మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, కౌన్సిలర్ ముబీనా తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లెలలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెల పంచాయతీలో సోమవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

పీలేరు రూరల్ : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిసంపత్‌కుమార్, అఖిల్ తదితరలు పాల్గొన్నారు.

గట్టుమీదపల్లె రోడ్డు పనులకు శ్రీకారం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ గట్టుమీదపల్లెకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచనల మేరకు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ గ్రామం అటవీ ప్రాంతంలో గట్టుపై ఉంది. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు వ్యవసా యంతో జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి ఇంత వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పలు అవస్థలు పడేవారు. దీంతో కొందరు కోసువారిపల్లెకు, మరికొందరు ఇతర పట్టణాలకు వెళ్లారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లినప్పుడు సమస్యలు తెలియజేశారు. మూడు రోజుల్లోనే రోడ్డు పనులను ప్రారంభించాలని ఆదేశించారు. సుమారు 3 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు నిర్మాణానికి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

100 లీటర్ల సారా స్వాధీనం



దాడుల్లో పట్టుబడిని నిందితులు

మదనపల్లె : మండలంలోని పాన్నేటిపాళ్యం అటవీప్రాంతంలో ఆదివారం ఎస్ఈబీ సిబ్బంది జరిపిన దాడుల్లో 100 లీటర్ల సారా స్వాధీనంతో పాటుగా తయారీ దారులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. పాన్నేటిపాళ్యం కారిగోళ్లబావి సమీపంలో ఎస్ఈబీ సిబ్బంది జరిపిన దాడుల్లో నక్కలదిన్నె తండాకు చెందిన బాణావత్ బాబునాయక్(26), నక్కలదిన్నె కాలనీకి చెందిన రామకృష్ణనాయక్(42)లను అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

నేటి నుంచి శ్రీ రామ పట్టాభిషేక మహోత్సవాలు

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో మూడు రోజుల పాటు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు. సోమవారం అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం, మంగళవారం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవ, శ్రీ సీతారామ శాంతి కళ్యాణం, హనుమంత వాహనంపై తిరువీధి ఉత్సవం, బుధవారం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, శ్రీరామ పట్టాభిషేకం, ఊంజల్ సేవ, సీతారామ లక్ష్మణులు గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.300 ఆర్జిత రుసుము చెల్లించాలన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ

- అదనంగా రాగిజావ
- ఇష్టంగా స్వీకరిస్తున్న విద్యార్థులు



జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీవైఈఓ క్రిష్ణప్ప(ఫైల్)

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులోనే రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో జగనన్న గోరుముద్దను అమలు చేస్తోంది. విద్యార్థులు రుచికరమైన ఆహారంతో పాటు ఉదయం రాగిజావను సైతం అందిస్తోంది. దీంతో విద్యార్థులు ఇష్టంగా మధ్యాహ్నభోజనాన్ని ఆరగిస్తున్నారు.

అభిరుచులకు అనుగుణంగా...

మదనపల్లె అర్బన్, మండల పరిధిలో 135 పాఠశాలున్నాయి. ఇందులో ప్రైమరీ 94, ప్రాథమికోన్నత 25, ఉన్నత పాఠశాలలు 16 ఉన్నాయి. ఇందులో ప్రైమరీ పాఠశాలల్లో 3526, ప్రాథమికోన్నత పాఠశాలలో 2802, ఉన్నత పాఠశాలలో 8235 మంది విద్యార్థులున్నారు. మొత్తం 8235 మంది విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకొచ్చింది. ఎప్పటికప్పుడు పిల్లలు, విద్యాశాఖ అభిప్రాయాలను సేకరిస్తోంది. నిత్యం ఆయా పాఠశాలల్లో ముందుగా ఉపాధ్యాయుడు వెళ్లి పరిశీలించిన అనంతరమే విద్యార్థులకు భోజనం అందించడం విశేషం.

నెలకు నాలుగు సార్లు గుడ్లు

గతంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు నెలకు మూడు సారుల కోడిగుడ్లు సరఫరా చేసేవారు. దీంతో కొన్ని చోట్ల కోడిగుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. ఇది గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగుసార్లు గుడ్లు సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లను అదే వారంలో వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు వారానికి అయిదు గుడ్లల ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న నేపథ్యంలోనే పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు చెబుతున్నారు.

మెనూ వివరాలు

- సోమవారం : హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, గుడ్డుకూర, చిక్కీ
- మంగళవారం : పులిహోరా,న టమటా పచ్చడి,దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- బుధవారం : వెజిటబుల్ బిర్యానీ, అలుకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం : సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం : ఆకుకూరపప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం : ఆకుకూర, సాంబార్, తీపిపొంగల్, రాగిజావ

భోజనంగా రుచిగా ఉంది



ప్రతి రోజూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తింటున్నా. వారంలో అయిదు రోజులు కోడిగుడ్లు ఇస్తారు. రోజుకో రకం వెరైటీ భోజనం పెడుతున్నారు. భోజనం చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో కన్నా మా పాఠశాలలోనే బావుంటుంది. విద్యార్థులందరం స్కూల్లోనే తింటున్నాం.

–మహమ్మద్ సమీ, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

ఇష్టంగా తింటున్నారు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దగా పౌష్టికాహారం అందిస్తోంది. విద్యార్థులకు ఇష్టమైన ఆహారం పెట్టడం, ప్రత్యేకంగా మెనూలో రాగిజావ చేర్చడంతో పోషకాలు బాగా అందుతున్నాయి. విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు.

–ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె

రోజూ పాఠశాలలోనే తింటా



గతంలో మధ్యాహ్న భోజనం సరిగ్గా తినే వాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉండటంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాము. ఇంట్లో భోజనంలాగా ఉంటుంది. రాగిజావ ఎంతో చాలా బావుంది.

–షేక్ సాదియా, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

తువ్వపల్లె 5వ వార్డు అభ్యర్థి ఏకగ్రీవం



బేతపూరి సుధారాణి

కేవీపల్లె : గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా మండలంలోని తువ్వపల్లె పంచాయతీ 5వ వార్డుకు వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తువ్వపల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న 5వ వార్డు ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కల్పించారు. ఈ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరచిన గ్రామానికి చెందిన బేతపూరి సుధారాణి ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. పరిశీలన అనంతరం ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎంపిక కావడానికి సహకరించిన సర్పంచ్ ఆనంద్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఆనందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దర్శకుడు కరుణాకర్‌కు దాసరి నారాయణరావు అవార్డు



కరుణాకర్

మదనపల్లె సిటీ: మదనపల్లెకు చెందిన సినీ దర్శకుడు డాక్టర్ కరుణాకర్‌కు దర్శకరత్న దాసరి నారాయణరావు అవార్డుకు ఎంపికైనట్లు అభిలాష హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆర్గనైజర్ వి.శ్రీరామ్‌కుమార్ తెలిపారు. సాంఘిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు ప్రజలకు సందేశాత్మక చిత్రాలు చిత్రీకరించినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 27న హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తామన్నారు. ఆయనకు అవార్డుకు ఎంపిక పట్ల సాహితీకళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరావు, నాగభూషణరావు తదితరులు అభినందించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

–ది సిటిజన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ పిఆర్‌విఎస్ రాజు



మాట్లాడుతున్న ది సిటిజన్ కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ పిఆర్‌విఎస్ రాజు

మదనపల్లె సిటీ: ఖాతాదారులకు ది సిజిటన్ కోఆపరేటివ్ బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ పిఆర్‌విఎస్ రాజు అన్నారు. ఆదివారం సీటీఎం రోడ్డులోని బ్యాంకు ఆవరణంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అయిదు రాష్ట్రాలలో 42 బ్యాంకు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. రూ.3,500 కోట్లుపైగా వ్యాపారలావాదేవీలు జరుగుతున్నాయని, రూ.1910 కోట్లు డిపాజిట్లు ఉండగా, రూ.1650 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. 2022–23 ఏడాదికి రూ.74 కోట్లు లాభాలు ఆర్జించినట్లు తెలిపారు. 93 వేల మంది ఖాతాదాలున్నారన్నారు. ప్రధానం సీనియర్ సిటిజన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.డిపాజిట్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు అందిస్తున్నామన్నారు. మదనపల్లె బ్రాంచి 2016 ప్రారంభించామని ఖాతాదారుల అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. రోజు రోజుకు బ్రాంచి అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ వేణునాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య, బ్యాంకు మేనేజర్ వి.లోకనాథనాయుడు,సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. ఖాతాదారులు అడిగిన పలు ప్రశ్నలకు మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బయ్య నివృత్తి చేశారు.

వరిసాగుకు అజోల్లా వరం

వాల్మీకిపురం: వరి సాగుకు అజోల్లా ఒక వరమని, అజోల్లాను వరిసాగులో వేయడం వలన తేమ శాతాన్ని బాగా పెంచుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పెద్ద రెడ్డెయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని టి.సాకిరేవుపల్లిలో రైతు చంటి సాగు చేస్తున్న అజోల్లాను రైతులతో పాటు ప్రకృతి సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా అజోల్లా వలన కలిగే ప్రయోజనాలను పెద్ద రెడ్డెయ్య రైతులకు వివరించారు. వరి సాగులో అజోల్లాను విరివిగా సాగు చేయడం వలన సాగులో తేమ శాతం పెంచడంతో పాటు కలుపును నివారిస్తుందని, 50 శాతం నత్రజని అందిస్తుందన్నారు. తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు వందశాతం అందుతాయని ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వినోద్, నరేంద్ర రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 36 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు రూరల్ : కంటి ఆపరేషన్లకు 36 మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటల్ నందు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 36 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమజ, లయన్స్‌క్లబ్ కోశాధికారి జయచంద్రనాయుడు, సభ్యులు ప్రసాద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్యంరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు ప్రత్యేక పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. గర్నిమిట్ట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళవాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు.

హార్సిలీహిల్స్ వద్ద డయాబెటిక్ ఆస్పత్రి

- లయన్స్‌క్లబ్ ద్వారా విస్తృత సేవలు
- నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానం చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ కింద కాండ్లమడుగు వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ ద్వారా డయాబెటిక్ హాస్పిటల్‌ను నిర్మించనున్నట్లు లయన్స్ డిస్ట్రిక్ కార్యదర్శి మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దపల్లె సమీపంలోని ఫాంహౌస్‌లో లయన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి నిర్మాణం కోసం స్థలాన్ని మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సముఖత వ్యక్తం చేశారని చెప్పారు. భవన నిర్మాణాలకు లయన్స్ డిస్ట్రిక్ట్ తరపున రూ.80లక్షల నిధులు అందుతాయని చెప్పారు. ఆక్సిజన్ సేవలు అవసరమైన వారికోసం బెంగళూరుకు చెందిన లయన్ భానుమూర్తి రెడ్డి రూ.80వేలతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ విరాళంగా ఇచ్చారన్నారు. పేదలకు అన్నదానం, పశువైద్య శిబిరాల నిర్వహణ, వృద్ధాశ్రమాలను ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ నూతన కమిటీ అధ్యక్షునిగా జి.రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా ఆదిత్య ప్రసాద్, కోశాధికారిగా బి.వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా భీమిగాని పద్మనాభరెడ్డి, నిమ్మనపల్లె కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలను ఎన్నుకొన్నారు. అనంతరం వీరిని సత్కరించారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

పీలేరు : స్థానిక కోటపల్లెలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ తెలిపారు. ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులతో 120 మీటర్లు పొడవుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నరసింహారెడ్డి, వార్డుమెంబరు మల్లికార్జునరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఉమాకాంత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బ్రాహ్మణవారిపల్లెలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

రామసముద్రం : రామసముద్రం మండలం మారుమూల ప్రాంతం కావడంతో గ్రామీణప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. ఆదివారం మండలంలోని కాప్పల్లె పంచాయతీ బ్రాహ్మణవారిపల్లెకు రూ.90 లక్షలతో మంజూరైన తారురోడ్డు పనులకు భూమిపూజ చేశారు. గ్రామస్తులు గత కొన్నేళ్లుగా గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడేవారు. ఈ మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కిలోమీటర్ మేర గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గ్రామస్తులు పడుతున్న అవస్థల నుంచి విముక్తి కలిపించడం జరిగిందని స్థానికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ విశ్వనాథ్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు కొండూరుకృష్ణారెడ్డి, నందకిషోర్‌రెడ్డి, తిప్పరాజు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే ఆత్మ సంతృప్తి



ఆస్పత్రిలో రోగులకు పండు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: సేవా కార్యక్రమాలతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని డాక్టర్ మొహమ్మద్ యాసిఫ్ అన్నారు. మౌలక పహడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు. అలాగే పట్టణంలోని వృద్ధులు, నిరుపేదలకు పాలు, పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఆర్థికంగా ఎంత ఎత్తుకు ఎదిగినా సమాజంలో చేసే సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందన్నారు. రాబోవు రోజుల్లో పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక దర్గా కమిటీ సభ్యులు జాకీర్ హుస్సేన్, తాహీర్ అలీ, ఖాదర్ ఖాన్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన ఎన్జీవోలు

మదనపల్లె సిటీ: విజయవాడలో జరిగే 21వ రాష్ట్ర ఎన్జీవో మహాసభలకు మదనపల్లె తాలూకా ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఆదివారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. స్థానిక ఎన్జీవో హోం వద్ద వాహనాలను మదనపల్లె యూనిట్ అధ్యక్షులు నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే సోమ,మంగళవారాల్లో జరిగే సభలకు హాజరుకానున్నట్లు తెలిపారు. సోమవారం జరిగే సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగస్తుల సమస్యలు విని పరిష్కార మార్గాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగస్తులకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ



చింతపర్తిలో వైద్య సిబ్బంది ర్యాలీ



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస, శ్రీవిద్య అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆదివారం చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఇంటింటా దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు నీటి నిల్వలు, దుర్గంధం నివాసాల పరిసరాలలో ఉండకుండా చూసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, శారద, ఎల్‌టి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులు దూరం

తంబళ్లపల్లె: ఇంటి పరిసరాలలో దోమలను నివారించినప్పుడు కీటక జనిత వ్యాధులు దూరమవుతాయని వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల డాక్టర్ విక్రాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో భాగంగా వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలేకుండా చూడాలన్నారు. దోమల లార్వా నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమకాటు జ్వరాల భారీన పిల్లలు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, వైదయ సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న నెట్ వర్క్ సమస్యలు



ప్రారంభమైన సెల్ టవర్ పనులు

కురబలకోట: మండలంలోని పిచ్చలవాండ్లపల్లెలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో సెల్ టవర్లు ఉన్నా ఈ గ్రామ పంచాయతీలో ఒక్క టవర్ కూడా లేదు. దీంతో ఏళ్లుగా ఇక్కడి గ్రామస్థులు వివిధ రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయ సేవలకు కూడా నెట్ వర్క్ సమస్య వెంటాడుతోంది. చౌక దుకాణ సరుకులు తీసుకోవాలన్నా.. నెలవారి వివిధ రకాల ఫించన్లు తీసుకోవాలన్నా నెట్ వర్క్ ఉన్న పక్క గ్రామాలకు వెళ్లి తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు అదే విధంగా బయోమెట్రిక్‌కు తంటాలు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఫోన్లు చేయాలన్నా ఎత్తైన ప్రదేశాలకు లేదంటే నెట్ వర్క్ తగిలే ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వివిధ ప్రభుత్వ పథకాలకు, సర్వేలకు ఇబ్బందులు పడ్డారు. దీంతో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. వారు కొత్త 4జీ బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను ఇటీవల మంజూరు చేయించారు. ఇందుకు తగిన భూమిని కూడా పక్కనున్న కాంచేపల్లె గ్రామస్థులు ఇచ్చారు. చిరకాల సమస్య తీరడానికి ఎట్టకేలకు సెల్ టవర్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు